నేడు ప్రధాని 'మన్ కీ బాత్'

నల్లకుంట: ప్రధాని నరేంద్ర మోడీ 117వ 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం ఆదివారం (నేడు) ఉంటుందని అంబర్‌పేట అసెంబ్లీ మన్ కీ బాత్ ఇన్‌చార్జి నాయిని బుచ్చిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 హిందీలో 11.30 గంటలకు తెలుగు అనువాదం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని 236 బూతుల్లోని బీజేపీ అసెంబ్లీ పదాధికారులు, డివిజన్ పదాధికారులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తమ కుటుంబ సమేతంగా కార్యక్రమాన్ని వీక్షించాలని కోరారు. అనంతరం సరల్ యాప్, నమో యాప్‌లో మన్ కీ బాత్ వీక్షించిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అదేవిధంగా క్విజ్ పోటీ కూడా ఉంటుందని, పాల్గొనే వారికి పీఎంవో నుంచి సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రధానితో కలిసే అవకాశం ఉంటుందని చెప్పారు.

నేటి బ్రాహ్మణ సమ్మేళనం వాయిదా

నల్లకుంట: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం కారణంగా ఆదివారం (నేడు) రవీంద్ర భారతీలో తలపెట్టిన బ్రాహ్మణ సమ్మేళనాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలోనే బ్రాహ్మణ సంఘాలతో సమావేశమై చర్చించి సమ్మేళనం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. మాజీ ప్రధాని మృతికి సంతాపంగా సమ్మేళనం వాయిదా వేశామని బ్రాహ్మణ బంధువులంతా సహకరించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే ఉపాధ్యాయ రత్న, స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2025 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలోని ఉపాధ్యాయులు కవులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికులు, వైద్యులకు జనవరి 12న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జనవరి 5 లోగా తమ పూర్తి బయోడేటాతో 96523 47207లో సంప్రదించాలని ఆయన కోరారు.

అయ్యప్ప పూజకు రండి



నల్లకుంట: న్యూ నల్లకుంట అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు తూములూరి శంకర రాం గురుస్వామి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యూ నల్లకుంటలోని హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం (నేడు) నిర్వహించనున్న వార్షిక అయ్యప్ప స్వామి మండల పూజ, సహస్ర కలశాభిషేక మహోత్సవానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన వెంట సమితి ప్రతినిధి రాఘవేంద్ర సాయి తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ డివిజన్ ఎన్నికల అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని నేతలు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు చేశారు. పోలింగ్ బూత్‌స్థాయి నుంచే కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ మనోహర్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకాంత్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సంతోష్ కుమార్

కాచిగూడ: బీహార్ నుంచి తెలంగాణకు వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ నుంచి రఘునాథ్ కుమారుడు సంతోష్ కుమార్ (42) విహారయాత్ర కోసం నగరానికి వచ్చి కాచిగూడ లోని సాయి పరివార్ హోటల్‌లో రూమ్ తీసుకున్నారు. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో హోటల్ నుంచి టూత్ బ్రష్ తీసుకు వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగా రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే శరవేగం..!

- అంబర్‌పేటలో 44,434 దరఖాస్తులు
- అర్హులను గుర్తించే పనిలో జీహెచ్ఎంసీ అధికారులు
- ఇంటింటికీ తిరుగుతూ వివరాల సేకరణ
- దళారులను నమ్మవద్దని ఆఫీసర్ల సూచన



అంబర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే శరవేగంగా జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. గతేడాది ప్రజా పాలన పేరిట ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించగా అంబర్‌పేట సర్కిల్ పరిధిలో 44,434 ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జీలు వచ్చాయి. నియోజకవర్గంలో ఐదు డివిజన్లలో సర్వే కొనసాగుతున్నదని సిబ్బందికి ప్రజలు సహకారించాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు.

ఇందిరమ్మ పథకం అమలు తీరు..

ఖాళీ స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని నిరుపేదలకు ఈ పథకంతో చేయూతనిస్తారు. స్థలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తారు. అలాగే ఇల్లు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద డబుల్ బెడ్రూం కేటాయిస్తారు. 50 నుంచి 100 గజాల స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తారు. అర్హులకు తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి.

దళారుల బెడద..

ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది దళారులు రంగంలోకి దిగారు. అమాయకులైన ప్రజలకు ఇళ్లు ఇప్పిస్తామని నమ్మిస్తున్నారు. అర్హుల జాబితాలో పేర్లు వచ్చేలా చూసుకుంటామంటూ నమ్మించి డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దళారులను నమ్మవద్దని అర్హులకే ప్రభుత్వ ఫలాలు అందుతాయని జీహెచ్ఎంసీ అధికారులు సూచిస్తున్నారు.

ఆందోళన వద్దు..
ఇంటింటికీ వస్తారు

ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే జనవరి 3 వరకు కొనసాగుతున్నది. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరి వద్దకు సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారు. దరఖాస్తులో పొందుపర్చిన చిరునామా వద్ద అర్జీదారులు అందుబాటులో ఉండాలి. సర్వే పారదర్శకంగా జరుగుతోంది. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారాని కృషి చేస్తా.

– డీఎంసీ మారుతీ దివాకర్

ఆర్థిక సంస్కరణలతోనే దేశ ప్రగతి



ప్రొఫెసర్ పుల్లారావును సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆర్థిక సంస్కరణలతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని పంజాబ్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో 'మైక్రో ఎకనామిక్స్ ఛాలెంజస్ ఇన్ ఎమర్జింగ్ ఎకనామిక్స్' అనే అంశంపై శనివారం ఉపన్యాసం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై డిమాండ్ సప్లై మధ్య ఉన్న సంబంధాలు, ఆర్థిక శాస్త్రం విస్తృత పరిధి తదితర అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని గమ్యాన్ని చేరేందుకు నిరంతరం కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ ఎకనామిక్స్ అనేది జీవితంతో ముడిపడి ఉందని, ప్రతిఒక్కరూ తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జేఏసీ నేత ప్రఫుల్ రాంరెడ్డి

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని రాహుల్‌గాంధీ చౌక్‌లో మాజీ మంత్రి దివంగత పీజేఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి పీజేఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ, నేతలు గడ్డం రాజేశ్, ఎల్లూరి భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ, సాయిరామ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని లోటు అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయకుమార్ గౌడ్ అన్నారు. చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానిగా ఎన్నో సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంతేగాకుండా తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కళను సాకారం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అలాంటి మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడం గర్వకారణం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ నాయకులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో ..

ముషీరాబాద్: రాంనగర్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ బీ–బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు సతీశ్‌గౌడ్, నరేందర్, ప్రేమ్‌కుమార్, జయకుమార్, సూర్యప్రకాశ్, గోవింద్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, లింగంగుప్తా, మురళీమోజెస్, అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కాచిగూడ: బర్కత్‌పురలోని కాంగ్రెస్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్, సీనియర్ కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రత్యేక అభిషేకాలు, పూజలు

నల్లకుంట: శని త్రయోదశిని పురస్కరించుకుని భక్తాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కుచి రాజేశ్వర శర్మ, సహాయ అర్చకులు దేవులపల్లి బాలచంద్ర శర్మ, పాలడుగు చంద్రశేఖర శర్మ మంత్రోచ్చారణల నడుమ శనీశ్వర స్వామికి తిలతైలాభిషేకం, తిలా హోమం నిర్వహించారు. ప్రత్యేక హోమంలో పాల్గొన్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు గురుస్వామి, కుచి రాజేశ్వర శర్మతో కలిసి ప్రత్యేక శని త్రయోదశి గురించి వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

చిక్కడపల్లి: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో నివసించే నర్సింహ, బాలాపూర్‌కు చెందిన స్రవంతితో నెల క్రితం పెళ్లి అయ్యింది. కాగా కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవ కారణంగా మాట్లాడుకునేందుకు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వచ్చారు. బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో గొడవ జరుగుతుందని 100 డయల్‌కు ఫోన్ రావడంతో చిక్కడపల్లి పోలీసులు వెళ్లారు. దీంతో గొడవను సర్దిచెప్పేందుకు వెళ్లిన కానిస్టేబుల్ శివకుమార్‌పై దురుసుగా ప్రవర్తించి బండరాయితో తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీంతో వెంటనే పోలీసులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శివకుమార్ తలకు మూడు కుట్లు పడ్డాయి. శివకుమార్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకుమార్‌పై దాడిచేసిన నిందితులు బాలాపూర్‌కు చెందిన స్రవంతి సోదరులు సంతోష్ (23), సందీప్ (22) అరెస్ట్ చేశారు. సంతోష్‌పై బాలాపూర్, మీర్‌పేట్ తదితర పోలీస్‌స్టేషన్లలో 11పైగా కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు రావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సయ్య, ఎల్‌వీ.సుబ్రహ్మణ్యం తదితరులు

కాచిగూడ: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బై ది పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు వి.గణేశ్ ఆధ్వర్యంలో జనవరి 26న హైదరాబాద్‌నుంచి ఢిల్లీకి చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త రిటైర్డ్ జడ్జి వీ లక్ష్మణరెడ్డి, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ ఆలీ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ప్రభు, బై ది పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు వి.గణేశ్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్

కవాడిగూడ: ఈ నెల 19 నుంచి కొనసాగుతున్న హైదరాబాద్ 37వ జాతీయ పుస్తక ప్రదర్శన నేటితో ముగియనున్నదని బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు కవి యాకూబ్, ఆర్ వాసు తెలిపారు. శనివారం వారు బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శనను యువత, టెక్నికల్ విద్యార్థులు సందర్శించడం ఆనందంగా ఉందన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



పూజలు చేస్తున్న
అర్చక స్వామి సీతారామ శర్మ

నల్లకుంట: ధనుర్మాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలోని శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో అర్చక స్వామి అప్పారావు మంత్రోచ్చారణల నడుమ సీతారాములు, గోదాదేవీకి అభిషేకం చేసి, పట్టు వస్త్రాలు పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు.

శనికి తైలాభిషేకం..

శని త్రయోదశిని పురస్కరించుకుని న్యూరామాలయం ప్రాంగణంలోని నవ గ్రహాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చక స్వామి సీతారామ శర్మ మంత్రోచ్చారణల నడుమ శనికి తైలాభిషేకం కావించారు. అనంతరం నవగ్రహ పూజలు చేసి హారతులు ఇచ్చారు.

అవార్డు స్వీకరణ



అవార్డు అందుకుంటున్న బండారి దయానంద్

కాచిగూడ: రతన్ నావల్ టాటా జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు బండారి దయానంద్ యాదవ్ ఉద్యోగపతి అవార్డును అందుకున్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చట్టిబోయిన నందకిశోర్ యాదవ్, పొన్నబోయిన సురేశ్ యాదవ్, డాక్టర్ రవితేజ, ఇట్టా ఉదయశ్రీ, డాక్టర్ దివ్య, శోభా తదితరులు ఈ సందర్భంగా బండారి దయానంద్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు.

వల్లభదాస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న
ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయ వ్యవస్థాపక సభ్యుడు వల్లభదాస్ మృతిచెందారు. దీంతో జవహర్‌నగర్‌లోని వల్లభదాస్ నివాసంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ వల్లభదాస్ పార్థివదేహం వద్ద శనివారం నివాళులర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు ఎస్టీ అశోక్, దినేశ్ కుమార్, ఎస్టీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న
ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లిలోని సెయింట్ ఆడమ్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రగతిలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, పలువురు మేధావులు పాల్గొన్నారు.

దీక్షా గ్లోబల్ స్కూల్‌లో..

ముషీరాబాద్: దీక్షా గ్లోబల్ స్కూల్‌లో జ్ఞాన ఎక్స్‌పో పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, నూతన నమూనాలను స్కూల్ డైరెక్టర్ బండారు గోవింద రావు ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతు



చెప్పల్‌బజార్‌లో మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న
కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ కుంగి, విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో స్థానికులతో పాటు, వాహనదారులు, పాదాచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ శనివారం జలమండలి అధికారులు, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ యాదవ్‌తో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేశ్ యాదవ్, బి.భీంరాజ్, నర్సింహ, లావణ్య, సాయి, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

11న రవీంద్రభారతిలో వడ్డె ఓబన్న జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న వేముల వెంకటేశ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వడ్డెర కులస్తుల ఆరాధ్యుడు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు వడ్డె ఓబన్న ఉత్సవాల కమిటీ చైర్మన్ వేముల వెంకటేశ్ తెలిపారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయంతి నిర్వహణకు రాష్ట్రంలోని వడ్డెర సంఘాల ప్రతినిధులతో జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వడ్డెర కులస్తులు వేలాదిగా తరలిరానున్నారని తెలిపారు. ఇందులో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాత్రి అయిలు మల్లు, మారయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక



సాయిరాజ్‌కు నియామక పత్రం
అందజేస్తున్న బుచ్చిరెడ్డి

కాచిగూడ: కాచిగూడ డివిజన్ పోలింగ్ బూత్ నెంబర్ 193 బీజేపీ అధ్యక్షుడిగా బి.సాయిరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి నియామక పత్రాన్ని సాయిరాజ్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్, నేతలు కృష్ణకుమార్, శీర్‌సాగర్, సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, సుమలత, పార్వతి, ప్రేమ్‌సింగ్, ప్రవీణ్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక అయ్యప్ప మండల పూజ

నల్లకుంట: న్యూనల్లకుంట అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు తూములూరి శంకర రాం గురుస్వామి ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం వార్షిక అయ్యప్ప స్వామి మండల పూజ, సహస్ర కలశాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం బ్రహ్మశ్రీ చింతులపాటి కృష్ణ మోహన్ శర్మ పలు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప దీక్షాపరులు భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అలాగే సాయంత్రం సహస్ర నామార్చన జరిగింది. అనంతరం అయ్యప్ప స్వామి నామ సంకీర్తన(భజన) జరిగింది.

నేడు ముగింపు

ఈ నెల 25న ప్రారంభమైన వార్షిక మండల పూజ, సహస్ర కలశాభిషేకం ఆదివారంతో ముగుస్తాయని శంకర రాం గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా చింతులపాటి కృష్ణ మోహన్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం 7 గంటలకు సహస్ర కలశాభిషేకం, వేద ఆశీర్వచన ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

'బంగ్లా హిందువుల అజ్ఞాత మరణకాండ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న
మాజీ డీజీపీ కే అరవిందరావు

కవాడిగూడ: హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని తోపుడు బండి సాధిక్ వేదికపై 'బంగ్లా హిందువుల అజ్ఞాత మరణకాండ' పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ కే అరవిందరావు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1971లో బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరిగిన దారుణాలను ప్రస్తావిస్తూ ఇంగ్లిష్‌లో వచ్చిన పుస్తకానికి తెలుగు అనువాదం అని చెప్పారు. హింస ఎందుకు జరిగింది..? ఇప్పటికీ ఎలా అర్థం చేసుకోవాలి అనుకుంటే ఈ పుస్తకం చదవాలి అని అన్నారు. సురేందర్, రాజేశ్వరి, సంతోష్, పరిమళ, ఆయూష్ పాల్గొన్నారు.

మట్టి మేధావి కొల్లూరు సత్తయ్య పుస్తకావిష్కరణ

ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో ప్రముఖ రచయిత కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ రచించిన మట్టి మేధావి కొల్లూరు సత్తయ్య పుస్తకావిష్కరణ శనివారం జరిగింది. ప్రొఫెసర్ కంచి ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లూరి భరత్, జర్నలిస్టు బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విప్లవ శ్రేణుల్లో నూతనోత్తేజం

న్యూ డెమోక్రసీల విలీనంపై హర్షాతిరేకాలు



విలీన సభకు హాజరైన విప్లవాభిమానులు

ముషీరాబాద్: పన్నెండేళ్ల పాటు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ భౌతిక దాడులకు పాల్పడుతూ ఎడమోహం, పెడమోహంగా ఉన్నా రెండు న్యూ డెమోక్రసీ పార్టీలు ఒకటి కావడంతో విప్లవాభిమానుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గతంలో ఒకే పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు 2013లో వచ్చిన చీలికతో రెండు గ్రూప్‌లుగా విడిపోయారు. అప్పటివరకు అన్నదమ్ముల వలే కలిసి ఉన్న వారు తర్వాత ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకున్నారు. అయితే కాలం నేర్పిన గుణపాఠంతో పాటు విప్లవ పార్టీల చీలికల వలన ప్రజలు, విప్లవాభిమానుల్లో చులకన కావడం ప్రభుత్వం, మతోన్మాద శక్తులు విప్లవ పార్టీలపై దాడి ముమ్మరం చేయడంతో వారిని ఎదుర్కొనేందుకు ఐక్యతే ఏకైక మార్గంగా కనిపించింది. దీంతో 8 నెలలుగా రెండు పార్టీల కేంద్ర, రాష్ట్ర నాయకులు పలు దఫాలుగా జరిపిన చర్చలు ఫలప్రదమైన సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంగా రెండు పార్టీలు విలీనం అయ్యారు. ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు విప్లవాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఒకరికొకరు పలకరింపులు, ఆలింగనాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం కనిపించాయి. సిద్ధాంతాల పేరుతో మరోమారు చీలికకు స్వస్తి పలకాలని మిగితా విప్లవ పార్టీలు కూడా ఐక్యతకు ముందుకు రావాలని, విశాల ఐక్య కూటమిని ఏర్పాటు చేసి పేద ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేయాలని వారు కోరుతున్నారు.